# మల్లాది వెంకటకృష్ణమూర్తి

## సినీ రచయితకీ ఓ కథుంటుంది



అప్పుడప్పుడే సినిమాలకి కథలు, సంభాషణలు అందిస్తున్న రచయిత శరత్‌బాబు.

ఓ పెద్ద కంపెనీ తనకి కబురుచేయడంతో శరత్‌బాబుకి ఎంతో సంతోషం వేసింది. అనేక జూబ్లీ సినిమాలు తీసిన ఆ కంపెనీ తనని పిలవడం అంటే తన ప్రతిభని సినిమా పరిశ్రమ గుర్తించినట్లే అనుకున్నాడు.

పెద్ద సినిమా కంపెనీలు వ్యవహారించిన రీతిలోనే వాళ్ళూ ప్రవర్తించారు. తమకి ఏ హీరోకి ఎలాంటి కథ కావాలో చెప్పారు కాని ఎంతిస్తారో మాత్రం చెప్పలేదు. అడగడానికి శరత్‌బాబుకి చాలా మంది రచయితల్లా మొహమాటం. అడిగితే వాళ్ళేమయినా అనుకున్నా, అనుకోకపోయినా అనుకుంటారని ముందే శరత్‌బాబు అనుకున్నాడు.

రోజూ కథా చర్చ. దర్శకుడు, నిర్మాత, మరొకరు తమకేం కావాలో చెప్తుంటే అలాంటి సీన్స్‌ని అందిస్తున్నాడు శరత్‌బాబు. అతను చెప్పిన వాటిల్లో ఒక్కటయినా వెంటనే 'బావుంది' అని నవ్వకోవడం లేదు నిర్మాతతో వచ్చిన మూడో వ్యక్తి. అందుకు కారణం 'అన్నీ బావున్నాయంటే నా అవసరం వుండదు' అని నిర్మాత అనుకుంటాడని ఇతగాడు అనుకోవడమే. ప్రతీదానికి ఏదో పుల్లింగం పెడితే తన ఉనికికి గుర్తింపు, తనకి తెలుసు అని ఇతరులు భావించవచ్చని ఇతగాడు భావించేరకం.

ఓ రోజు రెండు వేల రూపాయిలకి చెక్ ఇచ్చాడు నిర్మాత కథ ఇంటర్వల్ దాకా బాగా వచ్చిందన్న నమ్మకం కలగడంతో. అదే సరయిన సందర్భం అని తలచిన శరత్‌బాబు అడిగాడు.

"మనం నా రెమ్యునరేషన్ గురించి ఓ మాట అనుకుంటే బావుంటుంది."

"కథ పూర్తి కానీండి. ఇంకా నలభై సీన్స్ తృప్తిగా రావాలిగా" చెప్పాడు నిర్మాత.

"ఇంకో మూడు వేలు ఇవ్వండి సార్. డబ్బు అవసరం వుంది" చెప్పాడు శరత్‌బాబు మొహమాటంగానే.

"రేపు చూద్దాంలెండి" చెప్పాడు నిర్మాత. రేపు అంటే సినిమా వాళ్ళ డిక్షనరీలో చాలా రేపులు. ఈ లోగా ఇంటర్వెల్ తర్వాత మరో పాతిక సీన్స్‌ని అంతా ఓకే చేశారు. ఇంక క్లయిమాక్స్‌ని కూర్చడమే మిగిలి వుందనడంతో అడిగాడు శరత్ ఓ రోజు. నిర్మాత ఒంటరిగా ఎప్పుడు దొరుకుతాడా అని ఎదురు చూస్తున్నాడు. కష్టపడి పనిచేస్తున్నా, అందుకు ప్రతిఫలం గురించి అందరి ముందు మాట్లాడటం కాని, అడగడం కాని, ఎంత ఇస్తారో చెప్పండి అనడం కాని తెలుగుసినిమా ఇండస్ట్రీలో'అమర్యాద'గా చాలా కాలంగా ఆనవాయితీగా వస్తోంది. ఎవరిమీదో కుట్ర పన్నుతున్నట్టుగా పక్కకి తీసుకెళ్ళి ఈ విషయం రహస్యంగా మాట్లాడుతారు ఇటు రచయిత కాని, అటు నిర్మాత కాని.

నిర్మాత మధ్యాహ్నం భోజనానికి వెళుతుంటే శరత్ హోటల్ గదికి తాళం వేస్తుండగా తన కారు తాళం చెవులు మర్చిపోవడంతో వెనక్కి తిరిగి వచ్చాడు నిర్మాత. ఇద్దరు కిందకి కారు దాకా వెళ్ళేలోగా బేలన్స్ గురించి నసిగాడు శరత్.

కథకి అతనికి ఇచ్చింది మొత్తం ఆరు వేల రూపాయిలే. సంభాషణలని కూడా శరత్‌చేత రాయించడానికి ఒప్పుకోలేదు. తమ కంపెనీకి గతంలో రాసిన డైలాగ్ రైటర్ చేతే రాయిస్తామన్నారు. ఇంకో నాలుగు వేలు అడిగాడు శరత్‌బాబు. కనీసం పదివేలు తను ఎక్స్‌పెక్ట్ చేసానన్నాడు. 'సినిమా బాగా ఆడితే అలాగే ఇస్తాం' అన్నాడు నిర్మాత.

హైదరాబాద్‌లో షూటింగ్‌కి హాజరయ్యాడు శరత్‌బాబు. ఆ రోజు ఖర్చు చూస్తే అతనికి ఎంతో బాధవేసింది. సినిమా ఓపెనింగ్‌కి చేసిన భేషజానికి పాతిక వేలు తక్కువ ఖర్చు కాలేదు. డ్రై ఐస్‌ని నూట ఏభై కిలోలు మద్రాస్ నించి ఫ్లయిట్‌లో ప్రత్యేకంగా తెప్పించారు. తీరా అది ఉపయోగించే టైంకి కరిగిపోయింది. బూడిదలో పోసిన పన్నీరు దాని ఖర్చు.

హీరో ఇమేజ్ పెంచడానికి తను రాసిన పులి పాత్రలో నటించే పులికి, దాని శిక్షకుడికి, అతని బేటాలకి, రాకపోకలకి ఇచ్చినంత కూడా, అందరి కోరికలకు తగ్గట్టుగా కథని తయారు చేసిన తనకి ముట్టచెప్పలేదు.

ఆ సినిమా కోసం వాడే డ్రై ఐస్ కోసం పెట్టినఖర్చులో నాలుగో వంతు కూడా తనకి ఇవ్వలేదు. సెట్లో ఓ మూల కూర్చుని రచయిత శరత్‌బాబు నిర్లిప్తంగా నవ్వుకున్నాడు. ■

